నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?



నిరుద్యోగ భృతి విషయంలో కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. విధివిధానాలు ఏమిటనే విషయాన్ని కూడా త్వరితగతిన చెప్పాలి. నిరుద్యోగ భృతికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయకపోవడం అనుమానాలను రేకెత్తిస్తోంది. కాబట్టి స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

–నారగాని వంశీకృష్ణ, బీటెక్, 15వ వార్డు, పెడన

తల్లికి వందనం వెంటనే అమలు చేయాలి



ఎన్డీయే కూటమి ఎన్నికల సందర్భంగా తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పింది. ప్రతి ఎన్నికల సభలోనూ ఎన్డీయే కూటమి నాయకులు ఈ విషయాన్ని పదే పదే చెప్పి ఓట్లు అడిగారు. వారు ఇచ్చిన హామీ ప్రకారం ఏటా ప్రతి ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికీ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామన్నారు. అధికారం చేపట్టిన తర్వాత దాని ఊసే ఎత్తటం లేదు.

-పి.హేమలత, మచిలీపట్నం

సాగుకు సాయం అందించాలి



ఖరీఫ్ సీజన్ సగం వరకు వచ్చింది. పంటల సాగుకు ఇంకా డబ్బులు అవసరం. గతంలో సీఎం జగన్ ఉన్నప్పుడు సాగు సాయంగా మాకు రైతుభరోసా ఇచ్చేవారు. ఏటా చెప్పిన సమయానికి సాయం చేసి రైతులను ఆదుకున్నారు. టీడీపీ నేతలు అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.

– నీలకంఠం పెదరాఘవయ్య, మచిలీపట్నం

మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వాలి



ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 18 సంవత్సరాలు దాటిన అర్హులైన మహిళలకు నెలకు రూ.1,500 మంజూరు చేసి ఆదుకోవాలి. గత ప్రభుత్వం బీసీలు, ఓసీలకు చేయూత ద్వారా ఆర్థిక సహకారం అందించింది. ఈ ప్రభుత్వం కూడా తక్షణం రూ.1500 అందజేసి మహిళలను ఆదుకోవాలి.

– బి.నాగమణి, జానకిరామపురం, బంటుమిల్లి మండలం.

పాఠశాలల వాళ్లని ఫీజు అడగొద్దని చెబుతారా?



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చి ఉంటే ఈ పాటికే విద్యార్థుల తల్లులకు అమ్మఒడి పథకం ద్వారా నిధులు జమ అయ్యేవి. ఎన్డీయే కూటమి రావడంతో తల్లికి వందనం కింద పేరు మార్చి ఇస్తామంటున్నారే తప్ప ఎప్పటికి ఇస్తారో స్పష్టం చేయడం లేదు. అప్పటి వరకు పాఠశాలల వాళ్ల ఫీజులు అడగకుండా ఉంటారా...ఆ విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టగలదా.


– భళ్ల జ్యోత్స్నరాణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, పెడన

తల్లికి వందనం ఏమైంది?



నాకు ఒక ఆడపిల్ల. పెడన పల్లోటి స్కూలులో ఏడో తరగతి చదువుతోంది. గతంలో జగనన్న అమ్మ ఒడి పేరిట రూ.15వేలు జమ చేసేవారు. దీంతో పిల్ల చదువుకు ఇబ్బంది ఉండేది కాదు. కూటమి నాయకులు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. బడులు తెరిచి ఇన్ని రోజులైనా అయినా తల్లికి వందనం ఊసే లేదు. పాఠశాల యాజమాన్యాలు ఫీజులు కట్టమని ఒత్తిడి పెడుతున్నారు.

– నిమ్మగడ్డ అశ్విని, గంద్రం, గూడూరు మండలం



నారా వారి నక్క జిత్తులు

మచిలీపట్నంటౌన్/పెడన/అవనిగడ్డ : బాబు వస్తే గ్యారంటీగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం మంటూ ఎన్డీయే నాయకులు తమ ప్రసంగాలలోనూ, ప్రచారంలోనూ మాటలతో హోరెత్తించారు. సాధారణ ఎన్నికలకు ముందు ఏప్రిల్ 17న పెడన పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు సైతం సూపర్ సిక్స్ పథకాలు మీ భవిష్యత్తును మారుస్తాయంటూ హామీ ఇచ్చారు. దీంతో క్షేత్రస్థాయిలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సైతం ఆయా హామీలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి ప్రచారం చేసుకుని గద్దెనెక్కారు. ఇప్పుడు అధికార పగ్గాలు చేపట్టి ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో వెనుకంజ వేస్తున్నారు. అదేమని ప్రశ్నించిన వారికి రాష్ట్ర ఆదాయం అంతంత మాత్రంగానే ఉందని, ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నామని ఒకసారి, ఆయా పథకాలను అమలు చేయడానికి విధివిధానాలను ఖరారు చేస్తున్నామని మరొకసారి చెబుతూ కాలయాపన చేస్తున్నారు. కొంతకాలం క్రితం తల్లికి వందనం పథకం విషయంలో జీవో జారీ చేస్తూ ప్రతి తల్లికి అని పేర్కొన్నారు. జరిగిన పొరబాటును గుర్తించిన ఎన్డీయే కూటమి ఇంకా విధివిధానాలు ఖరారు చేయలేదని, ప్రతి విద్యార్థికి కూడా తల్లికి వందనం పథకం వర్తింపజేస్తామని రాగాలు తీస్తున్నారు. విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలకు పైగా అవుతోంది. మరో పక్క ఫీజులు చెల్లించాలని ఆయా ప్రైవేటు పాఠశాలల నుంచి ఒత్తిడి. ఎన్డీయే కూటమి తల్లికి వందనం డబ్బులు వేస్తుందనే ఆశతో తల్లిదండ్రులున్నారు. ఈ పథకం డబ్బులు ఎప్పుడు ఇస్తారా అంటూ ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజులపాలనపై, ఆయా పథకాల గురించి ప్రజల అభిప్రాయం ఏమిటో.. వారి మాటల్లోనే చూద్దాం..

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



ప్రతి మహిళకు నెలకు రూ.1,500

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
మచిలీపట్నం	97,881
పెడన	66,463
అవనిగడ్డ	87,693
నెలకు ఇవ్వాల్సిన సాయం	రూ.37.79 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	మచిలీపట్నం	32.89
	పెడన	201.72
	అవనిగడ్డ	116.32



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
మచిలీపట్నం	12,000
పెడన	27,738
అవనిగడ్డ	56,016
ఇవ్వాల్సిన సాయం	రూ.191.50 కోట్లు



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
మచిలీపట్నం	71,010
పెడన	59,674
అవనిగడ్డ	79,242
నెలకు ఇవ్వాల్సిన సాయం	రూ.62.97 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	మచిలీపట్నం	104.56
	పెడన	30.94
	అవనిగడ్డ	112.56



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
మచిలీపట్నం	32,466
పెడన	23,328
అవనిగడ్డ	18,694
ఇవ్వాల్సిన సాయం	రూ. 111.73 కోట్లు

నమ్మించి గొంతు కోసే రకం చంద్రబాబు



నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఎన్నికల ముందు అమలుకాని హామీలిచ్చి జనాలను నమ్మేలా చేశారు. సంపద సృష్టించి అన్ని పథకాలు అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారు. ఇప్పుడేమో సూపర్ సిక్స్ పథకాలను చూసి భయమేస్తోందని కొత్త నాటకానికి తెరతీశారు. మరి సంపద సృష్టించి ఇవ్వొచ్చు కదా.

– సింహాద్రి రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే, అవనిగడ్డ

రూ.20వేలు రైతు సాయం అందించాలి



కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.20వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రతి ఏటా సాగుకు ముందే డబ్బులు వేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులైంది. అయినా ఇంతవరకూ రైతులకు సాయం ఎప్పుడిస్తారు అనే విషయం ఎవరూ మాట్లాడటం లేదు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుతంరూ.20వేలు ఇచ్చి కౌలు రైతులను ఆదుకోవాలి.

– కండెల భాస్కరరావు, రైతు, పాపవినాశనం, ఘంటసాల మండలం

క్లుప్తంగా

నేటి నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

చిలకలపూడి(మచిలీపట్నం): చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి కె.అప్పారావు బుధవారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు మచిలీపట్నంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న చిత్రకళాసంసద్‌లో చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో వస్త్రప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన చేనేత, పట్టు వస్త్రాలతో పాటు కలంకారీ వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేత కార్మికులకు చేయూతనివ్వాలని ఆయన కోరారు.

28 మెడల్స్ కైవసం

మచిలీపట్నంటౌన్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఐసీఎస్‌ఈ ఆంధ్ర, తెలంగాణ రీజనల్ స్పోర్ట్స్ మీట్‌లో నగరానికి చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్ విద్యార్థులు 28 మెడల్స్‌ను కైవసం చేసుకున్నారు. వివిధ రకాల అథ్లెటిక్స్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి 14 బంగారు, 10 సిల్వర్, ఏడు బ్రాంజ్ పతకాలను కైవసం చేసుకున్నారు. పతకాలను సాధించిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం బుధవారం అభినందించింది. సాధించిన పతకాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్కూల్‌లో విద్యార్థుల అభినందన సభ నిర్వహించి వారు క్రీడల పట్ల చూపిన ఆసక్తిని కొనియాడారు. స్కూల్ ప్రిన్సిపాల్ శిబి ఆంటోనీ, వైస్ ప్రిన్సిపాల్ లిసమ్మ, పీఈటీ ఉమాకాంత్, అనూష, రాజేష్, కళ్యాణి, జనరల్ కో ఆర్డినేటర్ విజయ్‌ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి కార్నియాల సేకరణ

నాగాయలంక: గ్రామంలోని 7వ వార్డులో అనారోగ్యంతో బుధవారం మృతి చెందిన నాగిడి నాంచారయ్య (75) నేత్రాలను విజయవాడ తాడిగడపలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం కల్పించాలనే సంకల్పంతో ఆయన భార్య వీరమ్మ, కుమారులు నాగబాబు, సాంబశివరావు, కుమార్తె కన్నా లక్ష్మీకుమారి ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందు కొచ్చారు. నేత్రదాన మోటివేటర్స్‌గా ఉన్న స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణకు సమాచారం అందించగా వారి సహకారంతో కంటి ఆసుపత్రి లాబ్ టెక్నీషియన్ సాయి బృందం మృతుడి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి సేకరించిన నేత్రాల సంఖ్య 208కి చేరిందని రఘుశేఖర్ చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

పెడన: పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ఆరోగ్యాలను కాపాడుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛతాహి సేవ-2024 కార్యక్రమాల రెండో రోజు సందర్భంగా ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్, చైర్‌పర్సన్ భర్త కటకం ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయం, మెప్మా, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో బ్లీచింగ్, సున్నం జల్లి, దోమల నివారణ మందులను పిచికారి చేయించారు.



పెడనలో ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ గోపాలరావు, పక్కన కటకం ప్రసాద్ తదితరులు

మోపిదేవి: స్థానిక మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, పెదకల్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానాల్లో ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతాహి సేవ నిర్వహించారు. మోపిదేవి దేవస్థానం ప్రాంగణంలో నాగపుట్ట, సర్పదోష నివారణ మండపం, అభిషేక మండపం, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఆలయాల సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో కేజే శ్రీనివాసచంద్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో స్వచ్ఛతా పరుగు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, శ్రీనివాసరావు, శివ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా స్వచ్ఛతాహిసేవ-2024 కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం గ్రామాలలో మురుగునీటి నిల్వల్లో దోమలతో పాటు వాటి లార్వాలను సైతం నాశనం చేసేలా ఆయిల్‌బాల్స్ ప్రయోగం, సున్నం, బ్లీచింగ్ చల్లించడంతో పాటు దోమల మందు పిచికారీ, పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ మిత్రలకు వైద్య పరీక్షలు తదితర కార్యక్రమాలు జరిపినట్లు ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు తెలిపారు.

నంగేగడ్డ(నాగాయలంక): మండలంలో సాగుతున్న స్వచ్ఛతాహి సేవలో బుధవారం మండలంలోని నంగేగడ్డ పంచాయతీలో ఎంపీడీఓ జె.కె.సీతారామ్ కుమార్, విస్తరణాధికారి కె.అప్పలనరసమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో స్వచ్ఛతా రన్, పాఠశాల బాలబాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తోట లంకమ్మ, గ్రామ కార్యదర్శి పి.మల్లికార్జున రావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సహజీవనం ఘటనపై కేసుల నమోదు

మచిలీపట్నం(చిలకలపూడి): మచిలీపట్నం నగరానికి చెందిన ఓ మహిళతో సహజీవనం చేయటంతో పాటు వేరే మహిళతో పరిచయం ఏర్పరుచుకున్న ఘటనలపై చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది. సీఐ అబ్దుల్‌నబీ తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం నగరానికి చెందిన బిల్డర్ విజయ్ ఓ మహిళతో ఐదు సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నాడు. ఈ సమయంలో ఆ మహిళ వద్ద నుంచి కొంత సొమ్ము, బంగారం తీసుకున్నారన్నాడు. విజయ్ కూడా ఆ మహిళకు పలు దఫాలుగా ఆర్థిక సాయం చేశాడు. ఇటీవల విజయ్ మరో మహిళతో పరిచయం ఏర్పరుచుకుని మొదట సహజీవనం చేసిన మహిళను దూరంగా పెడుతూ వచ్చాడు. దీంతో ఆ మహిళ ఆగ్రహం చెంది మరో అమ్మాయితో విజయ్ ఉన్న ప్రాంతానికి వెళ్లి నేను ఇచ్చిన సొమ్ము, బంగారం తిరిగి ఇమ్మని వాగ్వాదానికి దిగిందన్నారు. విజయ్‌కు సంబంధించిన కారును తగులబెట్టే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారన్నారని తెలిపారు. సహజీవనం చేసిన మహిళ విజయ్‌తో ఉన్న మహిళ ఇరువురు కొద్దిసేపు వాగ్వాదానికి దిగి దాడులకు కూడా పాల్పడ్డారన్నారు. ఈ ఘటనపై సహజీవనం చేసిన మహిళ ఫిర్యాదుతో పాటు విజయ్ ఇచ్చిన ఫిర్యాదుపై పరస్పర కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత

పెడన: వినాయకుని నిమజ్జనం సందర్భంగా రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితి తలెత్తింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఒక వర్గం వారు వినాయకుని నిమజ్జనం చేసేందుకు గణపతి ప్రతిమతో ఊరేగింపుగా వెళ్తున్నారు. ఊరేగింపు సమయంలో పాటల వద్ద మరొక వర్గం వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ భక్తిపాటలను మాత్రమే వేసుకోవాలని పేర్కొన్నారు. అందుకు ఊరేగింపులోని వర్గం వారు మరొక వర్గం చెబుతున్నది పట్టించుకోకపోవడంతో మరొక వర్గం వారు ఆ ఊరేగింపులోని డీజే సౌండ్ బాక్సులను పగులగొట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఊరేగింపులోని వర్గం వారంతా పిల్లపాపలతో పాటు మహిళలు, పెద్దలు అంతా రోడ్డుపై బైఠాయించి దాడికి పాల్పడిన వారిని పట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాత్రి తెల్లవార్లు రోడ్డుపైనే ఉండటంతో పోలీసులు నచ్చజెప్పి బుధవారం ఉదయం మాట్లాడదామని పంపించారు. మచిలీపట్నం డీఎస్పీ సుభాని పరిస్థితిని పర్యవేక్షించారు. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సీఐ హబీబ్‌భాషా, బంటుమిల్లి ఎస్ఐ ఎ.గణేష్‌కుమార్‌ల పర్యవేక్షణలో పికెట్ ఏర్పాటు చేయగా పలు దఫాలుగా ఊరేగింపు వర్గం వారితో చర్యలు జరిపారు.

పోలీస్ స్టేషన్‌లో రాజీ..

పెడన పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ ఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభానీ, ఇన్‌స్పెక్టర్లు కాశీవిశ్వనాథ్, మూర్తి ఇరు వర్గాల పెద్దలతో చర్చలు జరిపి రాజీ కుదిర్చారు. దీంతో బుధవారం సాయంత్రం గణపతి నిమజ్జనం ఊరేగింపు పూర్తి చేశారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

పెడన: పట్టణంలో ఆదివారం రాత్రి స్థానిక బస్టాండు సమీపంలోని వినాయక ఆలయం, భజరంగ్‌దళ్ నాయకుడు కోటేశ్వరరావు ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని శ్రీఆగస్త్యేశ్వర స్వామి ఆలయం వద్ద పట్టణ, మండల నాయకులతో పాటు జిల్లా నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. శివాలయం ఆస్తుల పరిరక్షణపై పిటిషన్ వేసిన కోటేశ్వరరావుపై గతంలో దాడి చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. పోలీసులు తక్షణ చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత తీవ్రం చేయాల్సి ఉంటుందన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి దుర్గా ప్రసాద్‌రాజు, రాష్ట్ర ముఖ్య సలహామండలి సభ్యుడు పీవీఎస్ నాయుడు, బజరంగ్ దళ్ కృష్ణాజిల్లా నాయకుడు శ్రీరామ్‌శర్మ మహంకాళి, పెడన మండల అధ్యక్షులు పేరక రాంబాబు, సహ కార్యదర్శి పిచ్చుక శంకర్ తదితరులు ఉన్నారు. అనంతరం వీరంతా ఎస్ఐ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన

నంగేగడ్డ(నాగాయలంక): మండలంలోని నంగేగడ్డలో ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటే పనులను ఎంపీడీఓ జె.కె.సీతారామ్ కుమార్ బుధవారం పరిశీలించారు. 22న పంచాయతీల పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 3200 మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. ఏపీఓ టీవీఎన్ ముత్యాలు మాట్లాడుతూ ఈ పనులకు రూ.5 లక్షల అంచనాతో బడ్జెట్ రూపొందించామన్నారు.

ఏసీపీపై టీడీపీ నేత కుమారుడి దౌర్జన్యం

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ టీడీపీ నాయకుడి కుమారుడు చేసిన హంగామాతో ఉద్యోగులు భయభ్రాంతులైన ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. 9వ డివిజన్‌లో ఓ భవనం అక్రమంగా నిర్మించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి రెండు నెలల క్రితం టౌన్ ప్లానింగ్ విభాగంలో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవటం లేదంటూ గత మునిసిపల్ పాలకవర్గంలో ద్వితీయ స్థానంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన నాయకుడి కుమారుడు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి వచ్చి ఏసీపీ మల్లికార్జునరావును ప్రశ్నించారు. ఈ భవన యజమానులు బీపీఎస్ పథకం ద్వారా అన్ని అనుమతులు పొందారని ఏసీపీ బదులిచ్చారు. ఇంకా ఆక్రమణలో నిర్మించిన భవనం ఎందుకు తొలగించలేదంటూ నాయకుడి కుమారుడు ఏసీపీని ప్రశ్నించటంతో భవనం ఇంకా రోడ్డు మార్జిన్‌లో ఉందో, లేదో తెలుసుకునేందుకు సర్వేయర్‌కు రాశామని అయన నుంచి రిపోర్టు వచ్చాక చర్యలు తీసుకుంటామని తెలిపాడు. ఈ దశలో ఏసీపీకి టీడీపీ నాయకుడి కుమారుడికి మధ్య వాగ్వాదం పెరిగింది. రాయడానికి వీలు లేని భాషలో ఏసీపీని టీడీపీ నాయకుడి కుమారుడు దూషిస్తూ బల్లలపై గట్టిగా కొడుతూ దౌర్జన్యానికి దిగాడు. పనిచేస్తే చేయండి లేకపోతే..అంటూ అసభ్య పదజాలం వాడాడు. లేకపోతే నేనేంటో చూపిస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో ఆ విభాగంలోని సిబ్బంది అవాక్కయ్యారు.



ఏసీపీ మల్లికార్జునరావుపై వాదనకు దిగిన టీడీపీ నాయకుని కుమారుడు

రూ.50 లక్షలకు చీటీ పాటదారు టోపీ

పెడన: మండల పరిధిలోని పెనుమల్లి గ్రామంలో చీటీ పాటదారుడు జనం నెత్తిన టోపీ పెట్టి రూ.50 లక్షలకు పైగా సొమ్ముతో పరారు కావడంతో బాధితులు బుధవారం మీడియాను ఆశ్రయించారు. గ్రామంలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆవేదన వెలిబుచ్చారు. పెడన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేక మీడియా ముందుకు వచ్చినట్లు తెలిపారు. బాధితులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన శివకుమార్ చీటీలు వేస్తూ రూ.2 నుంచి రూ.5లకు వడ్డీకి కూడా డబ్బులు తీసుకున్నాడన్నారు. చీటీలు పాడుకున్న సొమ్మును తిరిగి అతనికే వడ్డీకి ఇచ్చామని, తల్లి అనారోగ్యంగా ఉందని సుమారు రూ.50 లక్షలు పైనే వసూలు చేశాడు. గ్రామం నుంచి వెళ్లిపోయి రేపిస్తా.. మాపిస్తానంటూ ఫోన్ టచ్‌లో ఉన్నాడన్నారు. ఆ తర్వాత అదీ కూడా లేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈలోగా కోర్టు నుంచి నోటీసులు కూడా పంపాడని, ఏం చేయాలో తెలియక మీడియాని ఆశ్రయించామన్నారు. ఈ సమావేశంలో బాధితులు ఊసా నాగమణి, గరికపాటి దుర్గ, జోగి రాంబాబు, బొమ్మసాని నాగు, ఆరేపల్లి కొండ, జన్ను సురేష్, పిల్లంగోళ్ల ఆంజనేయులు, పడమట స్వామి తదితరులు పాల్గొన్నారు. దీనిపై ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ ఫిర్యాదు ఇచ్చారని, ప్రాథమిక విచారణ సమాచారణ సమయానికే కోర్టు పరిధిలోకి వెళ్లిందన్నారు.

బోధనలో మెలకువలు మెరుగుపర్చుకోవాలి

గూడూరు: బోధనలో మెలకువలను మెరుగుపర్చుకోవడానికి స్కూల్ కాంప్లెక్స్ శిక్షణా తరగతులు దోహదపడతాయని గూడూరు ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యం అన్నారు. ముక్కొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రైమరీ లెవెల్ స్కూల్ కాంప్లెక్స్ తరగతులను ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ తరగతులకు హాజరుకావడం ద్వారా ఉపాధ్యాయులు నూతన విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులువైన పద్ధతిలో విద్యాబోధనకు శిక్షణా తరగతులు ఉపకరిస్తాయన్నారు. కాంప్లెక్స్ చైర్మన్ జి.శ్రీహరి, సీఆర్పీలు షేక్ సుభాని, ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 పవర్ స్ప్రేయర్ల పంపిణీ

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆముదార్లంకకు చెందిన 30 మంది వరద బాధిత రైతులకు పవర్ స్ప్రేయర్స్‌ను ఉచితంగా ఎస్ఐ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అందించారు. ఎస్ఐ మాట్లాడుతూ రైతులను ఆదుకున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులను అభినందించారు. లయన్స్‌క్లబ్ కోశాధికారి ముమ్మనేని రాజ్‌కుమార్ (నాని), సభ్యులు నర్రా సాయిబాబు, దోనేపూడి గోపి, కొల్లిపర మధు, అశ్వినికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

